

నేటి నుంచి పంటు రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరి వరద ఉధృతితో నరసాపురం-సఖినేటిపల్లి నడుమ జులై 21న నిలిపివేసిన పంటు రాకపోకలను ఈ నెల 5వ తేదీ సోమవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు నరసాపురం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వికె.వీరభద్రరావు తెలిపారు. దీనికి సంబంధించి మాధవాయపాలెం, సఖినేటిపల్లి వైపు ఉన్న ఫెర్రీ రేవుల్లో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. దాదాపు 15 రోజులు పంటు నిలిపివేయడంతో ఉభయగోదావరి జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పంటు (ఫైల్‌ఫోటో)



వైద్యం.. అరకొర..!

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలపై జనం ఆవేదన

ఏరియా ఆసుపత్రుల్లో కానరాని సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం

ప్రయివేటులో చేయించాలంటే రూ.ఐదు వేల వరకూ ఖర్చు

ఆర్థికంగా భరించలేక సామాన్య ప్రజానీకం అవస్థలు

ప్రభుత్వాసుపత్రుల్లో కిడ్నీ, గుండె సంబంధిత డాక్టర్ లేక అవస్థలు

కష్టార్జితమంతా ఆసుపత్రులకే అంటూ జనం గగ్గోలు

'నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన సత్యనారాయణ తల తిరుగుతుందని ఆసుపత్రికి వెళ్లగా ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకోవాలని డాక్టర్ రాసిచ్చారు. ప్రయివేటు సెంటర్‌లో అడిగితే రూ.ఐదు వేల వరకూ ఖర్చవుతుందని చెప్పారు. పనికెళ్తే తప్ప ముందుకు సాగని సామాన్య కుటుంబం సత్యనారాయణది. దీంతో ప్రభుత్వాసుపత్రిలో చూపించుకోవాలని భీమవరం, తాడేపల్లిగూడెం ఆసుపత్రుల్లో సంప్రదించగా ఇక్కడ సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం లేదని తెలిపారు. దీంతో ఏలూరు ప్రభుత్వ ఆసుప్రతిలో ఎంఆర్ఐ చేయిం చుకునేందుకు వస్తే 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు.'

'ఏలూరు రూరల్ గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళకు తలంతా తీవ్రమైన నొప్పి వస్తుందని ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లింది. ఎంఆర్ఐ స్కానింగ్ రాసిచ్చారు. అంత సొమ్ము ఖర్చు చేసే ఆర్థిక పరిస్థితి లేక ప్రభుత్వాసుపత్రికి వెళ్తే రెండు వారాలు పడుతుందని రాసిచ్చారు. అదేమని అడిగితే రెండు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రావడంతో ఎంఆర్ఐ స్కానింగ్‌కు 15 రోజులు పైనే సమయం పడుతుందని చెబుతున్నారు. ప్రయివేటు సెంటర్లలో చేయించుకోలేక ఇచ్చిన సమయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాసుపత్రుల్లో అరకొర సదుపాయాలతో రెండు జిల్లాల్లో రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ వంటివి ఏర్పాటు చేయకపోవడంతో సామాన్య ప్రజానీకం ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెండు జిల్లాలవ్యాప్తంగా తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, నూజివీడు, తణుకు, భీమవరం, పాలకొల్లు, భీమడోలు వంటి పట్టణాల్లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఎక్కడా సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం లేదు. ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో మాత్రమే సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ ఉన్నాయి. రెండు జిల్లాల ప్రజలు ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకోవాలంటే ఏలూరు ఆసుపత్రికి రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో స్కానింగ్ చేయించుకోవాలంటే 15 రోజులకుపైగా సమయం పడుతోంది. రోగం భరించలేక ప్రయివేటు సెంటర్లలో రూ.వేలు చెల్లించి స్కానింగ్ చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు మారుతున్నా సామాన్య ప్రజానీకం వెళ్లే ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యసేవల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ వెయ్యి మందికిపైగా రోగులు వస్తుంటారు. జిల్లాలోని ప్రతి ఏరియా ఆసుపత్రికి వందల సంఖ్యలో రోగులు నిత్యం వస్తుంటారు. కేరళ వంటి రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల్లో అవయవ మార్పిడి వంటి సదుపాయాలు సైతం అందుబాటులో ఉండగా మన దగ్గర మాత్రం సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయాలు సైతం ఉండని పరిస్థితి. మారిన జీవన విధానంలో అనేక రోగాలు చుట్టుముడుతున్నాయి. ఇటీవల రెండు జిల్లాల్లో అత్యధికంగా కిడ్నీ, బ్రెయిన్‌కు సంబంధించిన రోగాలతోపాటు, కేన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలు జనాన్ని చుట్టుముడుతున్నాయి. దీంతో ఆసుపత్రికెళ్తే ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రయివేటు సెంటర్‌లో చేయించుకోవాలంటే సిటీ స్కానింగ్‌కు రూ.2,500, ఎంఆర్ఐ స్కానింగ్‌కు రూ.ఐదు వేలు వరకూ తీసుకుంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో స్కానింగ్, రక్తపరీక్షలు, మందులకు తక్కువగా లెక్కించినా రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేల వరకూ ఖర్చవుతుంది. ఇదంతా ఒక్కరోజు ఖర్చు మాత్రమే. ఆ తర్వాత నిరంతరం ఖర్చు తప్పని పరిస్థితి ఉంటోంది. దీంతో వైద్యం ఖర్చు సామాన్యులకు భారంగా మారింది. ఆరోగ్యశ్రీ వంటి సదుపాయాలు ఆపరేషన్ వంటి రోగాలకు వర్తిస్తున్నాయే తప్ప, పరీక్షలకు వర్తించడం లేదు. దీంతో సామాన్యుల కష్టం వైద్యఖర్చులకూ చాలడం లేదు. దీంతో అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం ప్రతి ఏరియా ఆసుపత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయాలతోపాటు అన్ని రకాల పరీక్షలు అందుబాటులో తీసుకురావాలని జనం కోరుతున్నారు. అంతేకాకుండా జిల్లాలో ఏఒక్క ప్రభుత్వాసుపత్రిలోనూ కిడ్నీ, గుండె సంబంధిత డాక్టర్లు లేరు. దీంతో సామాన్య ప్రజానీకం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని అంతా కోరుతున్నారు.

ఘాటెక్కిన వంకాయ ధర

భారీ వర్షాలు, వరదల ప్రభావం



ప్రజాశక్తి - పాలకొల్లు

భారీ వర్షాలు, వరదల ప్రభావం కూరగాయల ధరల మీద పడింది. వరదలు రాకముందు కిలో రూ.40 పలికిన వంకాయలు ప్రస్తుతం రూ.120 నుంచి రూ.160 వరకూ పలుకుతుండటంతో వినియోగదారులు హడలిపోతున్నారు. దీంతో ఆంధ్రులకు ఇష్టమైన వంకాయ కూరకు సామాన్య, మధ్యతరగతి ప్రజలు దూరంగా ఉంటున్నారు. వంకాయలు ఎక్కువ లంక గ్రామాల్లో పండిస్తారు. గోదావరి వరదలకు లంకల్లోని కూరగాయల పంటలన్నీ దెబ్బతిన్నాయి. ఫలితంగా వంకాయలతోపాటు బీర, దొండకాయల ధరలు రెట్టింపయ్యాయి. దొండకాయలు కిలో రూ.20 నుంచి రూ.60కు, బీరకాయలు కిలో రూ.50 నుంచి రూ.వందకు పెరిగాయి. ఇక ఆనపకాయ ఒకటి గతంలో రూ.10 ఉంటే ప్రస్తుతం రూ.40కు పెరిగింది.

రేపు యువజనుల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల ఆరో తేదీన భీమవరం మున్సిపల్ ఆఫీసు వద్ద ఉన్న త్యాగరాజ భవన్‌లో ఏర్పాటు చేసిన యువజనుల జిల్లాస్థాయి ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌విఎన్.శర్మ, జి.ధనుష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శర్మ, ధనుష్ మాట్లాడుతూ సదస్సులో ప్రముఖ విద్యావేత్త, ఎంఎల్‌సి కె.లక్ష్మణరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాముతోపాటు ఇతర విద్యారంగ ప్రముఖులు ముఖ్య అతిధులుగా పాల్గొనున్నారని తెలిపారు. యువజనుల కెరీర్ గైడెన్స్, దేశభక్తి, దేశంలో, రాష్ట్రంలో యువతీ యువకులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు, యువజనుల మనోవికాసానికి ఉపయోగపడే విజ్ఞానదాయకమైన అంశాలతో సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో యువతీ, యువకులు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే మేథోపరమైన అంశాలను, నిర్దిష్ట రంగంలో విజయం సాధించడానికి అవసరమైన సమాచార నైపుణ్యాలను ప్రముఖ విద్యావేత్తలు యువజనులతో చర్చించనున్నారన్నారు. యువతీ యువకులు, విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడే ఈ సదస్సును అంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు, జిల్లా కోశాధికారి డి.రవితేజ, నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో ఇంటర్ విద్యార్థి గల్లంతు



ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం స్నానానికి దిగిన ఇంటర్ విద్యార్థి గల్లంతయ్యాడు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు పాతూరుకు చెందిన కొల్లి జాన్‌బాబు (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆరుగురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు ఆదివారం ఉదయం వచ్చాడు. ఈ క్రమంలో సముద్రంలో స్నానం చేస్తుండగా అలల ఉధృతికి లోపలకు కొట్టుకెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న జాన్‌బాబు కుటుంబ సభ్యులు, బంధువులు బీచ్‌కు వచ్చారు. జాన్ బాబు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

రైతు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ప్రాధాన్యత

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం ఇసుక, గనులు, లిక్కర్, భూముల లూఠీకి ప్రాధాన్యతిస్తే తమ ప్రభుత్వం రైతు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం ఆయన యలమంచిలి లంకలో పశువుల దాణా పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.1634 కోట్లు ఎగ్గొడితే తమ ప్రభుత్వం ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. మిగిలిన రూ.634 కోట్లు వారం రోజుల్లో జమ చేసి రైతులను ఆదుకుంటామని మంత్రి తెలిపారు. వరదలు, అకాల వర్షాలకు నష్టపోయిన లంక, ముంపు ప్రాంతాల ప్రజలతోపాటు రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాజీ సత్యనారాయణ, ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచి వల్లభ నరసింహారావు, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, బెజవాడ బుజ్జి, ఆరిమిల్లి రామ శ్రీనివాస్, మాత రత్నంరాజు, చిట్టూరి సీతారామాంజనేయులు, పీతల శ్రీను, జనసేన మండల అధ్యక్షులు కొడవటి వరబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పాలకొల్లు రూరల్: విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి

శ్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి నిమ్మల శ్రమదానం

మండలంలోని ఆర్యపేటలోని అరుంధతీ పేటలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల పైకప్పు శ్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం శ్రమదానం చేశారు. ఆయన స్వయంగా ఇసుక, కంకర గమెళ్లాలు నెత్తిన పెట్టుకుని కార్మికులతో కలిసి మిల్లర్‌లో వేశారు. సెంట్రింగ్ కర్రలపై నిల్చొని శ్లాబ్ పనుల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో మహనీయుల విగ్రహాల శ్లాబ్ నిర్మాణ పనుల్లో శ్రమదానం చేయడంతోపాటు దాతలనూ భాగస్వాములను చేస్తామన్నారు. కార్యక్రమంలో యలమంచిలి గ్రామ సర్పంచి బర్రె మేరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: వర్షాలు, వరదలకు నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. అగర్రు రైతు సేవా కేంద్రం వద్ద నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్ తన హయాంలో వ్యవసాయాన్ని గాలికొదిలేశారన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి, లాభసాటి వ్యవసాయంగా చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు ఎ.పార్వతి, మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్, గ్రామ సర్పంచి కడలి నాగమణి, ఎంపిటిసి సభ్యులు మామిడిశెట్టి లలిత కుమారి, నాయకులు కోడి విజయ భాస్కర్, పాముల రజినీ కుమార్, ఎన్.ఆదినారాయణ, ఎం.సత్యనారాయణ, కూటమి నేతలు పాల్గొన్నారు.



యలమంచిలి: మంత్రి నిమ్మల శ్రమదానం

స్వాతంత్ర్య యోధుల ఆదర్శాలు అనుసరణీయం

ఎంఎల్ఎ అంజిబాబుచే స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

స్వాతంత్ర్య సమరయోధుల ఆదర్శాలు అనుసరణీయమని, వాటిని అంతా ముందుకు తీసుకెళ్లాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని క్విట్ ఇండియా స్తూపం వద్ద శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత ర్యాలీగా వెళ్లి క్విట్ ఇండియా అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో తృణప్రాయంగా తమ ప్రాణాలు అర్పించారని, భీమవరంలో క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రలోనే సువర్ణ అధ్యాయంగా మిగిలిందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పక్షోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణాధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం పట్టణంలో ఆగస్టు 17న భూపతిరాజు సుబ్బతాతరాజు, దంతులూరి నారాయణరాజు, డాక్టర్ పాలకొల్లు సత్యనారాయణశర్మ, అడవి బాపిరాజు నేతృత్వంలో ఆనాటి స్వాతంత్ర్యోద్యమంలో జెండా ఎగరవేశారని, బ్రిటీష్ వారి దమననీతికి నలుగురు యోధులు మరణించారని అన్నారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేష్, ఎస్‌కె.చాన్‌భాషా, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కలిగొట్ల గోపాలశర్మ, కె.శిరీష, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో యాజమాన్య కమిటీల ఏర్పాటు

59 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు, 8న ఎన్నికలు

ప్రజాశక్తి - కాళ్ల

గత వైసిపి ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన విద్యారంగాన్ని చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాల్లో సమూల మార్పులు తెచ్చిన ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత వైసిపి ప్రభుత్వం నియమించిన పాఠశాలల్లోని తల్లిదండ్రుల కమిటీలను మార్చాలని నిర్ణయించింది. తల్లిదండ్రుల కమిటీల పదవీకాలం పూర్తి కావడంతో వాటి స్థానాల్లో కొత్తగా పాఠశాల యాజమాన్య(స్కూల్ మేనేజ్‌మెంట్) కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి స్పష్టమైన మార్గదర్శకాలు అందాయి. మండల విద్యాశాఖాధికారి నేతృత్వంలో ఆయా పాఠశాలల్లో గతంలో వున్న తల్లిదండ్రుల కమిటీలను రద్దు చేస్తూ కొత్తగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల కోసం షెడ్యూల్ ప్రకటించారు.

ఈనెల 8న ఎన్నికలు..

మండలంలో ఉన్న అన్ని 59 ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీల నియామకాల కోసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఈనెల 1న జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలల నోటీసు బోర్డులపై ఎన్నికల షెడ్యూల్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగిన రోజునే కమిటీల ప్రమాణస్వీకారం, తొలి సమావేశాలు నిర్వహించనున్నారు.

పోటీకి నిబంధనలు ఇవే..

పాఠశాల యాజమాన్య కమిటీల ఛైర్మన్లు, సభ్యులుగా పోటీ చేసేవారు స్థానికులై ఉండాలి. వారి పిల్లలు తప్పనిసరిగా అదే పాఠశాలలో చదువుతుంటేనే తండ్రికి కమిటీలో అర్హత కల్పిస్తారు. కమిటీల నేతృత్వంలోనే ఇకపై పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాల కల్పన పనుల పర్యవేక్షణ ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 8న యాజమాన్య కమిటీల నియామకాల కోసం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తారు.

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

ఎంఇఒ-2 వేంద్ర వెంకటేశ్వరరావు, కాళ్ల



ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి మండల విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు, మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈనెల 5వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించి, మధ్యాహ్నం 3 గంటలకు ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేసి నోటీసు బోర్డులో ప్రదర్శిస్తాం. ఈనెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించి మధ్యాహ్నం ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నుకుంటారు. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించి మొదటి సమావేశం నిర్వహిస్తాం. ఈ పాఠశాల యాజమాన్య కమిటీ పాఠశాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తా

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎంఎల్ఎ నాయకర్ అన్నారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీ పరిధి పెదపల్లవపాలెం, ఆదర్శ నగర్‌లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ నగర్ కాలనీలోని రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నాయకర్‌కు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి, జనసేన మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపీకృష్ణ, వాటాల కృష్ణమూర్తి, లక్కు బాబి, కొల్లాటి భోగరాజు, నల్లి నాగరాజు, కొప్పాడ నాగరాజు, బస్వాని కుమారస్వామి, దుసనపూడి సత్య నారాయణ, కర్రి దుర్గారావు, చెల్లుబోయిన ధర్మరాజు, లక్ష్మణ్ ఉన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

ఉపాధి కార్మికులకు వేతన వెతలు

మండల వ్యాప్తంగా బకాయి రూ.కోటి 62 లక్షలు

ప్రజాశక్తి - కాళ్ల

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంకి చెందిన ఉపాధి కార్మికులకు వేతనాలు అందక ఇక్కట్లు పడుతున్నారు. రెండు నెలలుగా చేసిన పనులకు కూలీ డబ్బుల కోసం తపాలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏడాది వేసవిలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ చట్టం పనులు చేపట్టారు. ఇందుకు సంబంధించి రెండు నెలల వేతనాలు అందరికీ పెండింగ్‌లో ఉన్నాయని ఉపాధి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా అక్షరాలా రూ.కోటి 62 లక్షల బకాయిలు ఉన్నాయి. ప్రతి ఏటా మండలంలో ముమ్మరంగా ఉపాధి పనులు జరుగుతుంటాయి. రోజువారీ వేలాది మంది కూలీలు పనులకు హాజరవుతుంటారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు అవుతుంది. ప్రభుత్వ నిధులు విడుదల చేసిన వెంటనే ఉపాధి కార్మికులు చేసిన పనికి వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమవుతాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారం లేదా సాంకేతిక సమస్యలు, ఇతరత్రా కారణాలేమైనా ఉన్నా 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలి. కానీ కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు తిలోదకాలిస్తోంది. దీంతో ఉపాధి కార్మికులు పూటగడవక అప్పులు చేసి బతుకీడ్చుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి సైతం జీతాల చెల్లింపునకు లక్ష్యాలను విధించటంతో అవస్థలు పడుతున్నారు. మరో వైపు కార్మికులకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని కార్మికులు వేతనాలపై ప్రశ్నించటంతో వారు కూడా సమాధానం చెప్పలేక సతమతం అవుతున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేస్తున్నారు.



కాళ్లకూరులో కాలువలో పనులు చేస్తున్న ఉపాధి కార్మికులు(ఫైల్ ఫొటో)

69 పనులకు 13,573 ఉపాధి కార్మికులకు రూ.కోటి 62 లక్షలు అందాల్సి ఉంది. ఇప్పటి వరకూ వారి ఖాతాలో డబ్బులు పడలేదు. దీంతో ఖాతాలు ఉన్నవారు పోస్ట్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఉపాధి హామీ చట్టానికి సంబంధించి కమిటీ ఏర్పాటు వంటి ప్రక్రియ చేపట్టాల్సి ఉండటంతో ఉపాధి కార్మికులకు వేతనాలు విడుదల చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేతనాలు సకాలంలో చెల్లించాలని కూలీలను కోరుతున్నారు.

నిధులు విడుదల కావలసి ఉంది

బుంగా రమేష్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్, కాళ్ల

ఉపాధి కార్మికులకు వేతనాలు రావలసి ఉంది. మే, జూన్‌లో చేపట్టిన పనులకు వేతనాలు ఇంకా అందలేదు. కేంద్రం నుంచి నిధులు విడుదల కావలసి ఉంది.

పంటదెబ్బ తిన్న ప్రతి రైతుకూ అండగా ఉంటాం

ఎంఎల్ఎ రాధాకృష్ణ



రైతులకు విత్తనాలను అందిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

ఊడుపులు అయ్యి పూర్తిగా పంటదెబ్బ తిన్న ప్రతీ రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఇరగవరం మండలం కేతవారిపాలెంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు విత్తనాలను సబ్సిడీ ద్వారా రాధాకృష్ణ అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులందరూ మరలా నారుమడులు వేసుకుని, పంటలు ఊడ్చుకోవడానికి విత్తనాలను సబ్సిడీ ద్వారా రూ.1250 ఉన్నటువంటి 30 కేజీల బస్తాను రూ.260 అందిస్తున్నామన్నారు. దీనితో పాటు ఎన్యుమరేషన్ చేయించి నష్టపరిహారాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. గత వైసిపి పాలనలో కాలువల నిర్వహణ కాని, డ్రెయినేజీ నిర్వహణ లేకుండా చేశారన్నారు. దాని ఫలితమే నేడు వర్షాలకు నీరు పంట పొలాల్లోకి చేరే పరిస్థితి నెలకొందన్నారు. రైతు సంఘాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాధికారులు, రైతులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

భీమవరం: ఆచంట మండలంలో కరెంట్ షాక్‌తో మరణించిన లైన్‌మెన్ ఏళ్ల రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ శాఖలో ప్రమాదాలకు గురవుతున్న ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఒక జీతభత్యాలు సక్రమంగా అందక, ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం అందక ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. కాంట్రాక్ట్ పనిలో ఉన్నప్పటికీ పూర్తి కాలం ఉద్యోగులుగా విధులు నిర్వహించాల్సి వస్తుందని, అయినా ఏళ్ల తరబడి పర్మినెంట్ లేకుండా ఏ రకమైన సదుపాయాలు లేకుండా, ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే లైన్‌మెన్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బాలలతో పనులు చేయించడం నేరం

కార్మిక శాఖాధికారి ఎం.కిరణ్‌కుమార్

నరసాపురం: మైనర్ బాలలతో పనులు చేయించడం నేరమని, అటువంటివారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కార్మికశాఖాధికారి ఎం.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు శనివారం పట్టణంలోని వ్యాపార దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకవిక్రయ కేంద్రంలో బాలిక పనిచేయడాన్ని గుర్తించారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి బాలిక చదువుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ తనిఖీలో సిడిపిఒ, ఊర్మిళ, అంగన్వాడీ సూపర్వైజర్ పద్మావతి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొడక్షన్ అధికారులు పాల్గొన్నారు.

దళిత ఐక్యసంఘం ఏర్పాటు

పెనుమంట్ర: మండలంలోని గ్రామాలలో గల దళిత సంఘాలను ఐక్యపరచడానికి, అంబేద్కర్ ఆశయ సాధనకై మండల దళిత ఐక్య సంఘాన్ని ఏర్పాటు చేశామని కమిటీ అధ్యక్షులు కుసుమే వెంకటేశ్వరరావు అన్నారు. న్యాయబద్ధంగా దళిత సమస్యలు, రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడతామని దళితులంతా ఐక్యమత్యంతో ఉండాలని, దళితుల పక్షాన ప్రభుత్వానికి సహకరిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం తొలి సమావేశాన్ని ఆలమూరు గ్రామంలో నిర్వహించగా, ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల దళిత నాయకులు, సంఘ కమిటీలు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

'ప్రపంచ శాంతికి శాకాహారమే ఏకైక మార్గం'

నరసాపురం: ప్రపంచ శాంతికి శాకాహారమే ఏకైక మార్గమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి.కృష్ణవేణి అన్నారు. నరసాపురం పట్టణంలోని కృష్ణబాబు కాలనీలో మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషుల ఆహారం శాకాహారం మాత్రమే తీసుకోవాలన్నారు. మాంసాహారం పలు రోగాలకు కారణమని తెలిపారు. పిరమిడ్ మాస్టర్ వి.వి.భారతి మాట్లాడుతూ శాఖాహారం వల్ల ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. అనంతరం రుస్తుంబాద జగన్నాథ స్వామి గుడి నుంచి పాత బజార్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, లక్ష్మి, శ్రీనివాస్, కొక్కిరగడ్డ జగన్నాధరావు, తోట అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఇన్సూరెన్స్ అభినందనీయం

జనసేన జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఆచంట: జనసేన సభ్యత్వం కలిగిన ప్రతిఒక్కరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపచేయడం అభినందనీయమని జనసేన జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పోడూరు మండల గుమ్మలూరు సంత మార్కెట్‌లో జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో సుమారు 50 సభ్యత్వాలు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస మాట్లాడుతూ పోడూరు మండలంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు వెంగల దాసు దానయ్య, గ్రామ అధ్యక్షులు బొక్క గణపతి, మండల ఉపాధ్యక్షులు తోలేటి వేణు, సంయుక్త కార్యదర్శి తోట అంజి, పెనుగొండ మాజీ అధ్యక్షులు కంబాల బాబులు, మండల ఉపాధ్యక్షులు తోట ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

పాలకొల్లు: స్నేహం అనేది ఒక మధురమైన భావన అని, స్నేహితులు లేకుంటే మానవ జీవితానికి పరిపూర్ణత చేకూరదని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు అన్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పాలకొల్లు కొత్త కుళాయి చెరువు వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వాకర్ మిత్రులు ఒకరికొకరు స్నేహ కంకణాలు ధరింప చేసుకున్నారు. తదుపరి తీపి మిఠాయిలు, చిరు జ్ఞాపికలు క్లబ్ తరపున అందరికీ అందించారు. కార్యక్రమాన్ని క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ నడిపించగా క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్ర రావు, ధనాని శ్రీరామమూర్తి, జవ్వాజి కళ్యాణ్, పాల్గొన్నారు.

తల్లిపాలే ప్రతి బిడ్డకూ తొలి టీకా

పెనుమంట్ర: శిశువులకు తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమైన పోషక ఆహారం అని, బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా తల్లిపాలు పనిచేస్తాయని మార్టేరు సెక్టార్ సూపర్వైజర్ పోచమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నెగ్గిపూడి, పెనుమంట్ర పంచాయతీ పరిధిలోని మూడు కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కాగా నెగ్గిపూడి శివారు వనంపల్లి గ్రామంలో అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో తొలుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లులు, గర్భవతులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సూపర్వైజర్ పోచమ్మ మాట్లాడుతూ ప్రతీ తల్లి కాన్పు అయిన అరగంటలో ముర్రుపాలు తాగిస్తే ఆ బిడ్డకు సహజ వ్యాధి నిరోధక శక్తి వస్తుందన్నారు. బిడ్డలకు పాలిచ్చే తల్లులకు రొమ్ము కేన్సర్ రాదని తెలిపారు. నెలలోపు శిశుమరణాలు జరగడానికి కారణం అయ్యే శ్వాసకోస వ్యాధులు, కామెర్లు, డయేరియా వంటి రోగాలను ఎదుర్కొనే వ్యాధి నిరోధక శక్తి తల్లి పాలలోనే నవజాతి శిశువుకు లభిస్తుందన్నారు. బాలింతలలో తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలని ఆరోగ్య, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. ఎంపిటిసి పెనుగొండ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు సరఫరా

నరసాపురం: నారుమడి పాడైన రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు సరఫరా చేయనున్నట్లు నరసాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఇ.అనిత కుమారి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్‌టియు-1153(చంద్ర) రకం వరి వంగడం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. నరసాపురం సబ్ డివిజన్‌లో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు 390.37 ఎకరాల నారుమడులు ముంపుకు గురయ్యాయన్నారు. 30 కేజీల వరి విత్తనాలు బస్తా రూ.1134 కాగా 80 శాతం రాయితీతో 907 తగ్గించి, రైతు వాటా 20 శాతం రూ.227 చెల్లించి విత్తనాలు తీసుకోవాలని ఆమె కోరారు.

నేరాలు - ఘోరాలు

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

ఉండి: మహిళను తన కోరిక తీర్చమని లైంగికంగా వేధించిన వ్యక్తిపై ఉండి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన నిమ్మితి గాయత్రి అనే మహిళను అదే గ్రామానికి చెందిన బొడ్డు మంగరాజు అనే వ్యక్తి తన కోరిక తీర్చమంటూ లైంగికంగా వేధిస్తున్నాడు. గాయత్రి తన భర్తకు చెప్పడంతో జులై 17వ తేదీన గాయత్రి భర్త మంగరాజును అడగగా మంగరాజు గాయత్రి భర్తపై దాడికి దిగి గాయపరచడంతో గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఉండి పోలీసులు బొడ్డు మంగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేత బస్తాలు అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: మేత బస్తాలు అదృశ్యంపై కేసు నమోదైన సంఘటన ఉండి మండలం కోలమూరు గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోలమూరు గ్రామానికి చెందిన నంద్యాల ఉదయ భాస్కర్ రాజు జులై 28వ తేదీ రాత్రి 20 మేత బస్తాలు చెరువు దగ్గర నుంచి తీసుకువచ్చి ఇంటి వెనక పెట్టగా తెల్లవారుజాము వెళ్లి చూసుకునేసరికి 20 మేత బస్తాలు, ఇంటి వెనక ఉన్న ఆరు కోళ్లు చోరీకి గురయ్యాయి. గ్రహించిన ఉదయ భాస్కర్ రాజు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏ గ్రామ వాసులం మేము..!

తాళ్లకోడు కాలనీవాసుల ఆవేదన



తాళ్లకోడు కాలనీ రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి - ఆకివీడు

తాము ఏ గ్రామానికి చెందిన వారమో అర్థం కావడం లేదని, తమ సమస్య ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియటం లేదని మండలంలోని తాళ్లకోడులోని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో ఉన్న తమను ఇంటి స్థలాలు ఇస్తామంటూ తీసుకువచ్చి కుప్పనపూడి పరిధిలోని తాళ్లకోడులో స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టుకోమన్నారన్నారు. ఆకివీడు పరిధిలోకి ఈ ప్రాంతం చేరుస్తామంటూ ఆనాడు చెప్పారు. అయితే నేటికీ అది జరగలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో సుమారు 400 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. వాటిలో 100 ఇండ్లు పూర్తిచేసుకుని వారు అక్కడ కాపరాలు చేస్తున్నారు. అయితే అక్కడ ఏ రకమైన మౌలిక సదుపాయాలూ ఏర్పడలేదు. అధికారులు గాని, ఆనాడు వైసిపి ప్రతినిధులు గాని ఇళ్లు కట్టించడానికి చూపిన శ్రద్ధ మౌలిక సదుపాయాల మీద పెట్టలేదు. దీంతో ఇళ్లు కట్టుకున్న వారు భారీ స్థాయి గోతిలో ఇళ్లు కట్టుకున్నట్టయింది. మంచినీళ్లు లేవు, లైట్లు లేవు, పట్టపగలే మబ్బు వేస్తే చిట్ట అడవిలో ఉన్నట్టుంటుంది అని వారు వాపోతున్నారు. ఈ స్థితిలో వారి సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కానటువంటి పరిస్థితి ఏర్పడింది. కుప్పనపుడా, ఆకివీడా తమను ఎవరూ పట్టించుకోవటం లేదంటూ ఆ ప్రాంత వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం ద్వారా తెలిపారు.

మా సమస్యలను పరిష్కరించేదెవరు?

దూబ భారతి, కాలనీవాసి



మా సమస్యను ఆకివీడు అధికారికి చెబితే మాకు సంబంధం లేదన్నారు. ఇది కుప్పలపూడి కాదు, ఆకివీడు అంటూ, మున్సిపాలిటీ అని పేరు చెప్పి ఒక సెంటు స్థలం ఇచ్చారు. కుప్పనపూడి పంచాయతీ అంటే రెండు సెంట్లు ఇవ్వాలి కదా. అసలు మేము ఏ గ్రామవాసులం? సమస్యలు ఎవరికి చెప్పాలి? ఈ కాలనీలో ఉండాలంటే భయమేస్తోంది. ఇంట్లోంచి బయటకు వస్తే గోతులు గొప్పుల్లో పడిపోతున్నాం. మొన్ననే ఆటో వచ్చి తలకిందులైపోయింది. పిల్లలకు దెబ్బలు తగిలాయి. ఇటీవలే మా అబ్బాయికి విషజ్వరం సోకి అప్పు చేసి లక్ష రూపాయలు ఖర్చు పెట్టాం. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చి రెండు రోజులు అయింది. లక్షలు పెట్టి అప్పులు చేసి ఇల్లు కట్టాం. వెళ్లిపోవాలో, ఉండాలో అర్థం కావడం లేదు.

తాగడానికి నీళ్లు లేవు

పి.శ్రీదేవి, కాలనీ వాసి



తాగడానికి నీళ్లు లేవు, ఆకివీడు నుంచి కొని తెచ్చుకుంటున్నాం. వాడకానికి మా కాలనీ వెనుక ఉన్న పంట కాలువ నుంచి గొట్టాలు పెట్టారు. అది ఎప్పుడు మోటార్ వేస్తారో తెలీదు. మాలో కొన్ని నీళ్లు కుప్పనపూడి పరిధిలోకి వెళ్లాయంటూ వాళ్లకి వేరే టైంలో కూడా ఇస్తున్నారు. అది ఎప్పుడు ఇస్తారో తెలవదు. అర్ధరాత్రి వదులుతున్నారు ఒకళ్లు. అవి కూడా నాలుగు రోజులకు, మూడు రోజులకు ఒకసారి. నీళ్లు తెచ్చుకుందాం అంటే మోకాలు లోతు బురద, నలుగురం పడిపోయి దెబ్బలు తిన్నాం.

కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలి

ఆర్.వెంకటరమణ



లైట్లు లేవు, మేం సబ్ స్టేషన్ పక్కన ఉన్నాం కానీ మాకు మాత్రం కరెంటు ఉండదు. కొప్పలపూడి నుంచి కనెక్షన్ ఇచ్చారు. ఎప్పుడు వేస్తారో తెలియదు, ఎప్పుడు తీస్తారో తెలియదు. ఇది మా ఊరు కాదు ఆకివీడు అంటారు వాళు .. మాది కాదంటారు ఆకివీడు వాళ్లు. ఇంతకీ మేము ఏ గ్రామానికి చెందిన పౌరులం. మాకు చెప్పండి. వెంటనే కలెక్టర్ స్పందించి మా సమస్యలు తీరుస్తూ, మమ్మల్ని ఒక పంచాయతీ లేదా మున్సిపాలిటీకి సమన్వయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం


బి.రాంబాబు, డివైఎఫ్ఐ నాయకులు



గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన సందర్భంలో ఇక్కడ రోడ్ల కోసం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. వెంటనే ఆ నిధులు వినియోగించి రోడ్ల నిర్మాణం చేయాలి. ఈ ప్రాంతంలో వైద్య సదుపాయానికి మెడికల్ సబ్ సెంటర్‌ను అత్యవసరంగా ఏర్పాటు చేయాలి. కాలనీలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం.

వయనాడ్ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - యలమంచిలి



యలమంచిలి : సిపిఎం నాయకులకు విరాళాన్ని అందిస్తున్న మంత్రి నిమ్మల

ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ప్రకృతి వలయంలో ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోవడమే కాకుండా వందలాది మందికి ప్రాణనష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలకు సహాయార్థం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికుల నుంచి రూ.20 వేల 771 విరాళాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ విరాళాలను అడిగిన వారందరూ సహృదయంతో స్పందించి తమకు తోచిన విధంగా విరాళాలను అందించి మానవత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జార్జి, పి.వెంకటస్వామి, మానవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండలు, శ్రీనివాస్, కోరం వెంకటేశ్వరరావు, ముమ్మిడివరపు ఆంజనేయులు, డివైఎఫ్ఐ నాయకులు తెన్నేటి స్టాలిన్, పల్లేరు అనిల్, పల్లేరు ఆనంద్, భారతుల రాజేష్, చెట్టిమి వానబాలుడు, ఆకుమర్తి జోసెఫ్, తెన్నేటి జయరాజు, జున్ను పాల్గొన్నారు.

సిపిఎం విరాళాల సేకరణకు మంత్రి నిమ్మల స్పందన

రూ.1000 విరాళం అందజేత

మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై ఆదివారం కేరళ వయనాడ్ బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్న సమయంలో వేరే కార్యక్రమంలో పాల్గొని అదే రహదారిపై కాన్వాయ్‌లో వెళుతున్న రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తన కాన్వాయ్‌ను తనంతట తాను ఆపారు. సిపిఎం నాయకులు చేస్తున్న విరాళాల సేకరణ గురించి అడిగి తెలుసుకుని, వారిని అభినందించడమే కాక తన వంతుగా రూ.వెయ్యి విరాళాన్ని అందించారు.

తణుకు: కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తమ వంతు సహాయం చేసేందుకు ముందుకు రావాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఆదివారం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల సహాయార్థం వేల్పూరులో స్థానిక సాలిపేట నుంచి బస్టాండ్ వరకూ షాప్ టు షాపు తిరుగుతూ ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలు, వరదల వల్ల కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు వందలాది మంది సర్వస్వం కోల్పోయారని, అధిక నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు తమ వంతు సహాయంగా రూ.10,400 విరాళాలు అందించిన వేల్పూరు గ్రామ ప్రజలకు వీరభద్రరావు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాథం వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, విశ్వనాథం సుబ్బారావు, అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను, గోదావరి ముంపు బాధితులను ప్రజలు ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో షాప్ టూ షాప్ ఆర్థిక సహాయం కోసం తిరిగారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఇటీవల కేరళలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగి పడటంతో ఊళ్లకి ఊళ్లు నేలమట్టం అయ్యాయని అన్నారు. ఈ ప్రమాదంలో వందలాది మంది నిద్రలో చనిపోయారని, వందలాది మంది సర్వస్వం కోల్పోయారని తెలిపారు. గోదావరి వరదలు, ముంపు వల్ల ఆహారం లేక ఇబ్బంది పడుతున్న వారిని కూడా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, రమేష్, భాస్కరావు, అంజి, సాయిబాబు, రాజు పాల్గొన్నారు.

ఆచంట: వయనాడ్ బాధితుల సహాయార్థం ఆదివారం పోడూరు మండలంలో సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ వరదల్లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మానవతా దృక్పథంతో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. విరాళాల సేకరణలో రూ.4 వేలు ఆర్థిక సహాయం అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు కలిశెట్టి సింహాచలం, కిలారి సాంబయ్య, జి.గంగాచలం, చివటపు ఆంజనేయులు, డి.గవరయ్య, గాంధీ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఆంధ్ర, కేరళ వరద బాధితుల సహాయార్థం సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అయిదు దళాలుగా పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరవరపు రంగారావులు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో గోదావరి వరద ముంపు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేరళలో సంభవించిన విపత్తు కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం కోసం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జవ్వాది శ్రీను, యాంద్రపు కృష్ణ, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, వర్రి అప్పారావు, నరమాల కృష్ణ, చిట్టేటి సత్యనారాయణ, చిట్టి దుర్గాప్రసాద్, మిద్దే జాన్, యడవల్లి వెంకట దుర్గారావు, పత్తివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

గణపవరం : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కేరళ వరద బాధితులకు పిప్పర గ్రామంలో ప్రజల వద్ద నుంచి రూ.3,300 విరాళాలు సేకరించినట్లు మండల కమిటీ కార్యదర్శి పి.నరసింహమూర్తి తెలిపారు. బాధితులకు విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు పి.గోవింద్, ఎస్.సంజీవరావు, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగల్తూరు : కేరళలో చోటు చేసుకున్న విపత్తుతో నిరాశ్రయులైన బాధితుల సహాయార్థం ఆదివారం సాయంత్రం సిపిఎం నాయకులు నిధుల సేకరణ చేపట్టారు. మొగల్తూరులోని ప్రజలు, వ్యాపారుల వద్ద విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్ల చిట్టిబాబు, ఆదూరు సాంబమూర్తి, కొత్తపల్లి నాగరాజు, అడ్డాల ఏడుకొండలు ఉన్నారు.

పంటనష్టం పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో ఇటీవల సంభవించిన అధిక వర్షాలు, వరదల కారణంగా నక్కల, తాడేరు, కొట్టాల్పర్రు కాలవ సమీపంలో ఉన్న పంట పొలాలు అధిక శాతం దెబ్బతిన్నాయని ఆచంట విఆర్ఒ సీతారాం అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముంపునకు గురైన పంట పొలాలను రెవెన్యూ అగ్రికల్చర్ అసిస్టెంట్ శృతి, తదితరులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, నష్టపరిహారం విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా బెరేజిగా అంచనాల వేసి రైతులను ఆదుకునేందుకు నష్టపరిహారం తక్షణమే అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో తప్పిపోయిన 12 ఏళ్ల బాలుడుని వెతికి కాళ్ల పోలీసులు భీమవరంలో పట్టుకున్నారని కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు ఆదివారం తెలిపారు. ఏలూరుపాడు హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న బర్రి సంపత్ కుమార్‌ను తల్లి లక్ష్మి మందలించిందనే కోపంతో ఈనెల 4వ తేదీ ఆదివారం ఉదయం ఇంటినుంచి వెళ్లిపోయాడు. తప్పిపోయిన బాలుడి ఫోటో సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. బాలుడు తండ్రి ఏసుబాబు ఫిర్యాదు మేరకు బాలుడు కోసం మూడు బృందాలుగా పోలీసులు వెతికారు. బర్రి సంపత్ కుమార్‌ను కాళ్ల పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ మహేంద్రదీప్, సురేష్‌లు భీమవరంలో వెతికి పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులకు ఆదివారం సాయంత్రం అప్పగించారు.

సూరిబాబు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు తల్లి ధనలక్ష్మి శనివారం కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈమేరకు కాళ్లలో ఆదివారం సూరిబాబు కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిఐటియు జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ పరామర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, సిపిఎం నాయకులు బాతు రామస్వామి, తిరుమాని శ్రీనివాస్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ నిరసన

భీమవరం : ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వల్ల 59 కులాల మధ్య గొడవ పెట్టారని, దేశ ప్రజయోజనాలు తాకట్టు పెట్టి 59 కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆర్గనైజర్ కోనా జోషప్ అన్నారు. భీమవరం అంబేద్కర్ సెంటర్‌లో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోషప్ మాట్లాడుతూ రాష్ట్రపతి పరిధిలో గల 241 ఆర్టికల్ ప్రకారం కాకుండా తీర్పు రావడం దురదృష్టకరమని అన్నారు. అడ్వకేట్ తాళ్లూరి మధు మాట్లాడుతూ మిగతా కులాల శ్రేయస్సు కోరి రివ్యూ పిటిషన్ చేసి తీర్పు ఫ్రీజ్ చేయాలని కోరారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఈ తీర్పును అంగీకరిస్తే భవిష్యత్‌లో రిజర్వేషన్‌తు పూర్తిగా తీసివేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం వెనుకాడదని అన్నారు. కార్యక్రమంలో ఇల్లూరి సంపత్ కుమార్, గొల్లమండల స్టాన్లీ జొన్స్, భీమవరం యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బేతాళ కమలకర్, రవికుమార్, బుంగా ఆదాము పాల్గొన్నారు.

గణపవరం: ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం అంబేద్కర్ ఇండియన్ మిషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో జల్లి కాకినాడలో స్థానిక అంబేద్కర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బాతు నాగేశ్వరరావు, బళ్లారి అశోక్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా ఉందని అన్నారు. వర్గీకరణ తీర్పు దళితుల అభివృద్ధి కోసం కాదని, వారిని అణచివేతకు ఉపయోగపడుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే రద్దు చేయాలని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడేపల్లి సాయికృష్ణ, మాదాసి జీవన్ కుమార్, మేడేపల్లి చిన ముత్యాలు, ఓగిరాల రమేష్, మేడేపల్లి సురేష్, అనపర్తి బాబి పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

పెనుమంట్ర: వర్షాకాలంలో ప్రజలు అధికంగా రోగాలబారిన పడతారని, అందరూ జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక వైద్యాధికారులు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ప్రదీప్‌కుమార్ కోరారు. ఆదివారం మండలంలోని ఆలమూరు గ్రామంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య కేంద్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలలో భాగంగా ఈ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇటీవల రెండు జనరల్ వైరల్ ఫీవర్స్ నమోదైయ్యాయని, ప్రతి ఫీవర్ కేసుకు రాపిడ్ కిట్స్ పరీక్ష, వైడల్ టెస్టులు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో ఫీల్డ్ స్టాఫ్ టీమ్స్ ద్వారా క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆలమూరు గ్రామంలో పంచాయతీ వారు రొటీన్ యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ ఆయిల్ బాల్స్ తదితర కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. ఈ శిబిరంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు సూచించిన టెక్నికల్ గైడెన్స్‌తో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ పిబి.రామారావు, ఎక్సటెన్షన్ ఆఫీసర్ యు.శివప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ ఎం.నానిబాబు, ఫీమేల్ ఆరోగ్య పర్యవేక్షకురాలు పి.పద్మ కుమారి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, బెల్లపుకొండ నారాయణ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పుట్టినరోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా త్రిమూర్తులు, మద్దుల రాము మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, బిజెపి యువజన నాయకుడిగా రాష్ట్రస్థాయిలో అనేక ఉద్యమాలకు, పోరాటాలకు నేతృత్వం వహించి, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహించి, నేడు కేంద్రమంత్రిగా వర్మ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భారీ కేక్‌ని కట్ చేశారు. కార్యక్రమంలో యలమంచిలి శ్రీను, వినకొండ వినాయక్, మారపట్ల శ్యామ్, రాంబాబు పాల్గొన్నారు.

భీమవరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో సేవా కార్యక్రమాలను బిజెపి భీమవరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా రక్తదానం, చీరల పంపిణీ, పండ్లు, బియ్యం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కాగిత సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్, అల్లూరి సాయి దుర్గరాజు, షేక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఉండి: నరసాపురం ఎంపీ, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ జన్మదిన వేడుకలను బిజెపి మండల పార్టీ అధ్యక్షులు యర్రా విక్రం ఆధ్వర్యంలో బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నరసాపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పేరిచర్ల సుభాష్ మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ నుంచి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిచి కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమని కొనియాడారు. నాయకులు కొమ్మన నాగబాబు, ఉద్దరాజు గాంధీ రాజు, ఉద్దరాజు చిట్టిబాబు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎంఎల్‌ఎ బండారు పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి, మోడీ గ్రామాలలో మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు ఆదివారం పలువురిని పరామర్శించారు. మోడీ గ్రామానికి చెందిన నిప్పులేటి బోసు, కడిమి విజయభాస్కర్‌లు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన ముత్యాలపల్లి గ్రామ సర్పంచి కొప్పనాతి పల్లయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి పల్లయ్య అని మాధవ నాయుడు అన్నారు. ఇది సందర్భంగా పల్లయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆయన వెంట బస్వాని ఏడుకొండలు, కర్రి వీరాస్వామి, ఏడుకొండలు, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

జాతరను ప్రారంభించిన ఎంఎల్‌ఎ

భీమవరం: పట్టణంలోని 3వ వార్డులో 32వ ఆషాఢమాస శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతి ఏటా నిర్వహించడం అభినందనీయమని, ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతర వేడుకలు చేయడం సంతోషకరమని అన్నారు. అనంతరం జాతర వేడుకలను ప్రారంభించారు. శక్తివేషాలు, గరగల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతర మహోత్సవ నిర్వాహకులు యాతం శ్రీను, మాజీ కౌన్సిలర్ యాతం నాగలక్ష్మి, టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో కలకలలాడింది. ఆషాడ మాసం ఆఖరి ఆదివారం కావడంతో గ్రామానికి చెందిన తోట మణిబాబు సమకూర్చిన కూరగాయలతో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.